## మెదక్ డీఎస్పీ బదిలీ

మెదక్ అర్బన్, జూలై 20: మెదక్ డీఎస్పీ రాజేశ్వర్‌ను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. మెదక్‌లో మతకల్లోలాలు జరగడంతో ఇప్పటికే ఇద్దరు సీఐలు, ఎస్పీ బదిలీ అయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బదిలీల ప్రక్రియ చేపట్టిన అధికారులు డీఎస్పీని బదిలీ చేశారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీఎస్పీని ఆదేశించారు.

### రామాయంపేట దవాఖానకు కాయకల్ప బృందం

రామాయంపేట, జూలై 20: రామాయంపేట సీహెచ్‌సీలో ఈనెల 24న రాష్ట్ర వైద్య శాఖ కాయకల్ప బృందం పర్యటించనున్నట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి తెలిపారు. శనివారం దవాఖానలో ఆయన మాట్లాడుతూ బృందలోని నలుగురు సభ్యులు దవాఖానలోని పరిసరాలు, ఓపీ సేవలు, లాబొరేటరీ, వైద్య సేవలు, పేషంట్ల వివరాలు అడిగి తెలుసుకుంటారన్నారు. మందులు తదితర వాటిని పరిశీలిస్తారన్నారు. కాయకల్ప బృందం సమగ్ర పరిశీలన జరిపి రాష్ట్ర, జిల్లా వైద్యాధికారులకు దవాఖాన పరిస్థితులపై నివేదిక అందిస్తారన్నారు.

### అందుబాటులో టెక్నికల్ కోర్స్ మెమోలు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 20: జిల్లాలో ఫిబ్రవరిలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టైలరింగ్, డ్రాయింగ్) పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెమోలు డీఈవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు డీఈవో రాధాకిషన్ ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాల్‌టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు అందజేసి, మెమోలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తి, జూలై 20: నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తున్నదని పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మాసాయిపేటకు చెందిన రాజుల విజయ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స చేయించుకుంటున్నది. ఆర్థికంగా పరిస్థితి బాగాలేకపోవడంతో మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న రాజిరెడ్డి రూ.2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించి, క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ నర్సింలు, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు



రామాయంపేట, జూలై 20: రైతులు తమ సందేహాలను గ్రీవెన్స్ సెల్‌లో నివృత్తి చేసుకోవాలని రామాయంపేట ఏఈవో రాజ్‌నారాయణ అన్నారు. శనివారం తన కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌ను ప్రారంభించారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. పంట రుణాలు మాఫీ కాకుంటే ఆధార్ కార్డుతో వచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సాయికృష్ణ, రాజు నాయక్, రాజు ఉన్నారు.

### ఉద్యోగుల సమస్యలు పట్టని ప్రభుత్వం: టీఆర్‌టీఎఫ్

రామాయంపేట, జూలై 20: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్ ఆరోపించారు. శనివారం మండలంలోని దామరచెర్వు ప్రభుత్వ పాఠశాలలో జిల్లా సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ప్రభాకర్, మోహనశర్మ, ఇంద్రసేనాచారి, శేఖర్, నవీన్ రత్నాకర్, నాగేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WATER PROOFING**

★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124

**OLD AGE HOME**

★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766-All

**WANTED**

★ బ్యాంకు బ్యాలన్స్ '0' చూపిస్తుందా? ఐతే మీ చేతుల్లోనే ఉంది బ్యాలెన్స్‌ను పెంచుకొనే చిట్కా. వెంటనే కాల్ చేయండి. స్త్రీ/పురు నో ఏజ్ లిమిట్. సంప్ర: 8919302962, 7702925337.
NT-339541

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలి
- రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి
- పీడీఎస్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రజల సౌకర్యార్థం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యలు విన్నవిస్తూ అర్జీలు సమర్పించేందుకు నిత్యం ఐడీవోసీ (కలెక్టరేట్)కు వచ్చే వారికీ ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందలేకపోతున్న అర్హులైన దరఖాస్తుదారులు, ప్రజాపాలన సేవా కేంద్రాలను సందర్శించి, లోటుపాట్లుంటే సరిచేయించుకోవచ్చని తెలిపారు. డేటా సవరణకు వచ్చే దరఖాస్తుదారులు తమ వెంట రేషన్‌కార్డ్, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నెంబర్ వెంట తీసుకునిరావాలని సూచించారు. కలెక్టర్ వెంట డీపీవో యాదయ్య, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ ఉన్నారు.



రామాయంపేటలోని జాతీయ రహదారి బైపాస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్‌లో సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

### అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. జిల్లాలోని పెద్దశంకరంపేట మండలంలో 356.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని ఫిబ్రవరి 14న సీజ్ చేశారు. వాహనంపైన 6 ఏ, రూ.4 లక్షల జరిమానా, యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు గుర్తుచేశారు.

### సర్టిఫికెట్ల అందజేత

మెదక్ మున్సిపాలిటీ, జూలై 20: వృత్తి నైపుణ్యాలను యువత సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తుకు భరోసా చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసకున్న యువత ఆసక్తిని బట్టి ఆయా రంగాల అభివృద్ధికి బ్యాంకు రుణాలు మంజూరు చేయబడుతుందన్నారు. ప్రతి అంశంలో బేసిక్స్ నేర్చుకోవాలని, నూతనంగా ఆలోచించాలని సూచించారు. జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జి మనీషా పాల్గొన్నారు.

### రామాయంపేటలో కలెక్టర్ విస్తృత పర్యటన

రామాయంపేట, జూలై 20: రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాలు జరగకుండా వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. రామాయంపేటకు విచ్చేసి, పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. మెదక్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కోసం రామాయంపేట జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, ప్రమాదాలు జరుగుతున్న బైపాస్ రోడ్డును పరిశీలించారు. బైపాస్ వద్ద ప్రమాదాలు జరుగకుండా పటిష్ట భద్రత చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ అధికారి సర్దార్‌సింగ్, తహసీల్దార్ రజినీకుమారి, ఆర్‌ఐ రాజు ఉన్నారు.

# వదలని ముసురు



రామాయంపేటలో రోడ్డుపై పడిన భారీ వృక్షం

రామాయంపేట, జూలై 20: రామాయంపేటలో మూడు రోజుల నుంచి ముసురు వదలడం లేదు. చినుకులు ఏకధాటిగా పడుతున్నాయి. శనివారం వర్షం జోరందుకున్నది. టీచర్స్ కాలనీ వద్ద జాతీయ రహదారి మధ్యలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. విష యం తెలుసుకున్న పోలీసులు చెటున్టు జేసీబీ సాయంతో పక్కకు తొలిగించారు. పెట్రోల్ బంకు వెనుకాల ఉన్న కాలనీలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, కమిషనర్ దేవేందర్ పరిశీలించారు. వర్షం పడడంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, జూలై 20: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురుస్తున్నది. దీంతో పొలం పనులు జోరందుకున్నాయి.

**శివ్వంపేట మండలంలో 4.6 మి.మీ వర్షాపాతం నమోదు**

శివ్వంపేట, జూలై 20: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 4.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యు అధికారులు తెలిపారు. ఏకధాటిగా వర్షం కురియడంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



శివ్వంపేటలో కురుస్తున్న వర్షం



రామాయంపేట ప్రభుత్వ బడిలో స్లాబ్ నుంచి నీరు లీకేజీ



చిన్నశంకరంపేట: బస్సుకోసం నిలబడ్డ విద్యార్థులు

## రాజీ మార్గంతో ఇరువురికీ న్యాయం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, జూలై 20: రాజీ మార్గంతోనే ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద అన్నారు. శనివారం జిల్లా న్యాయస్థానాల సముదాయంలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. టేక్మాల్ గ్రామంలో 150 ఎకరాలకు సంబంధించిన సివిల్ కేసును ఇరువర్గాల వారు నికత్ షాహీన్ అండ్ ఆర్గనైజేషన్ వర్సెస్ స్టెర్లింగ్ అండ్ విల్సెన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు పిటిషనర్ 2 అమెరికా, పిటిషనర్ 5 హైదరాబాద్, జీపీఏ హోల్డర్ పిటిషనర్ 3గా ఉన్నారు. ఈ కేసును ఆన్‌లైన్ (వర్చువల్) ద్వారా నిర్వహించి రాజీ కుదిర్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు లా ఆఫీసర్స్ చంద్రసేన్, లక్ష్మణ్‌కుమార్, కె.సునీల్, ఎం.రాము, ఎం.రాధ, శ్రీవాస్తవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ ఏమైంది?: పట్లోళ్ల శశిధర్‌రెడ్డి



శశిధర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, జూలై 20: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి, ఎందుకు కల్పించడం లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కులగణన చేపట్టి, 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో బీసీ భవన్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి కుంటుపడక ముందే ఎన్నికలు నిర్వహించాలన్నారు.

## చిన్నారులను అంగన్‌వాడీకి పంపాలి



అమ్మమాట అంగన్‌వాడీ బాటలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సీడీపీవో

నర్సాపూర్, జూలై 20: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. శనివారం నర్సాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో సీడీపీవో హేమాభార్గవి ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధన చేస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికి తీస్తున్నారన్నారు. నర్సాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, నిర్మాణానికి సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో హేమాభార్గవి కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సునీత, కౌన్సిలర్లు లతారమేశ్‌యాదవ్, యాదగిరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకుడు ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సూపర్‌వైజర్లు, టీచర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆటపాటలతో చిన్నారులకు విద్యాబోధన**

శివ్వంపేట, జూలై 20: ఆటపాటలతో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నట్లు సీడీపీవో హేమభార్గవి అన్నారు. శనివారం దొంతిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సంతోష, సూపర్‌వైజర్లు వసుమతి, సరళ, పంచాయతీ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

## పోచమ్మకు బోనాలు



నిజాంపేట, జూలై 20: నిజాంపేటలో మున్నూరు కాపు సంఘం సభ్యులు ఆషాఢ మాస బోనాలను శనివారం పోచమ్మకు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివసత్తుల ఆటపాటలు అందరినీ అలరించాయి.

## ఘనంగా దుర్గామాత పల్లకీ సేవ



ఏడుపాయల్లో దుర్గమ్మ పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పాపన్నపేట, జూలై 20: ముసురేసిన వర్షంలోనూ వన దుర్గమ్మపై భక్తి చెక్కు చెదరలేదు. గురుపౌర్ణమి పురస్కరించుకుని శనివారం రాత్రి ఏడుపాయల దుర్గమ్మకు పల్లకీ సేవ నిర్వహించారు. అర్చకులు, ఏడుపాయల చైర్మన్ బాలగౌడ్, ధర్మకర్తలు, భక్తులు మొదట దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పల్లకీపై ఊరేగించారు. భక్తులు దుర్గమ్మ తల్లికి జై అంటూ పల్లకీని భుజాలపైకి ఎత్తుకుని, గర్భగుడి నుంచి గోకుల్ షెడ్డు వరకు అమ్మవారి పల్లకిని మోశారు.

## శాకాంబరీగా సరస్వతీదేవీ



శాకాంబరీగా దర్శనమిచ్చిన సరస్వతీదేవిని పూజిస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

శివ్వంపేట, జూలై 20: మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో గల చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి దేవాలయంలో సరస్వతీదేవిని శాకాంబరిగా శనివారం అలంకరించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం సత్యనారాయణ వ్రత మండపంలో శాకాంబరిగా కొలువుదీరిన సరస్వతీదేవికి ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవదత్తుశర్మ, ప్రభురాజ శర్మ, ఆర్‌ఐ కిషన్, భక్తులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

తూప్రాన్, జూలై 20: అప్పుల బాధతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్రెడ్డిపల్లిలో శనివారం జరిగింది. తూప్రాన్ ఎస్సై 2 యాదగిరి తెలిపిన వివరాల ప్రకా రం.. మండలంలోని గుండ్రెడ్డిపల్లికి చెందిన గాండ్ల ఆంజనేయులు (36) గతేడాది తూ ప్రాన్‌లో హార్డ్‌వేర్ షాపు ప్రారంభించాడు. షాపు సరిగా నడవకపోవడంతో సుమారు రూ.10 లక్షల వరకు నష్టాలు వచ్చాయి. దీంతో అతడు అప్పుల పాలయ్యాడు. హార్డ్‌వేర్ షాపు మూసివేసి తన స్వగ్రామం గుండ్రెడ్డిపల్లిలో వ్యవసాయం చేసుకుంటూ, కిరాణా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. తన భార్య గాండ్ల మౌనిక కిరాణా షాపును నిర్వహిస్తున్నది. అప్పుల బాధ ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు శనివారం మధ్యాహ్న సమయంలో ఇంట్లోకి వెళ్లి దూలానికి చీరతో ఉరేసుకున్నా డు. మౌనిక తన భర్త ఆంజనేయులును ఎంత పిలిచినా పలుకకపోవడంతో ఇంటి పక్కన ఉండే దొంతి బాలేశ్, ఇతరుల సహాయంతో తలుపులు పగలగొట్టి చూశారు. ఆంజనేయులు దూలానికి ఉరేసుకుని కనిపించాడు. కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆంజనేయులు మృతదేహానికి పంచనామా నిర్వహించి, తూప్రాన్ ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై2 యాదగిరి తెలిపారు.

## పోలీసులు మెరుగైన సేవలు అందించాలి



సమీక్ష సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- త్వరగా పెండింగ్ కేసులు పరిష్కరించాలి
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 20: ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి, ఏయే అంశాలు క్రోడీకరించాలి, తదితర అంశాల గురించి వివరించారు. కేసులో పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకశంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

### - ఇద్దరు మృతి.. పలువురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు, మృతి చెందిన ఆజారావు

మనోహరాబాద్, జూలై 20: కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడి ఇద్దరు మృతి చెందారు. పలువురికి గాయాలైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహిళ ఆజారావు (55) తన కుటుంబీకులు భాస్కర్‌రావు, మరో ఐదుగురు పెద్దవారు, నలుగురు చిన్నారులు మొత్తం 11 మందితో కలిసి బాసర పుణ్యక్షేత్రానికి శనివారం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని బంగారమ్మ ఆలయం వద్ద డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహిళ ఆజారావు అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నగరంలోని ఎర్రగడ్డ దవాఖానకు తరలించారు. వీరిలో భాస్కర్‌రావు (57) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందా డు. మిగిలిన వారికి గాయాలయ్యాయని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్, కారు ఢీకొని ఒకరు మృతి

కౌడిపల్లి, జూలై 20: కారు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ శివారులోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ధర్మాసాగర్ గ్రామానికి చెందిన రెడ్డి సుభాష్ (30) బైక్‌పై కౌడిపల్లికి వెళ్లి వస్తున్నాడు. నర్సాపూర్ నుంచి ఎదురుగా వస్తున్న కారు ఆయన బైక్‌ను ఢీకొన్నది. రెడ్డి సుభాష్ రోడ్డుపై పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. సుభాష్ ధర్మాసాగర్‌లోని సిమెంట్‌షాపులో కూలీగా పని చేస్తుంటాడు. రోజు మాదిరిగానే ఇంటికి తన బైక్‌పై తినడానికి వెళ్లి, సొంత పని మీద కౌడిపల్లి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



చంద్రమౌళి (ఫైల్)

శివ్వంపేట, జూలై 20: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన రైతు చింతకాయల చంద్రమౌళి (50) తన పొలంలో బోరుమోటర్ చుట్టూ ఉన్న గడ్డిని తొలిగిస్తుండగా, విద్యుత్ వైర్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు చింతకాయల నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## రైతులను మోసగించిన కాంగ్రెస్: బీజేపీ

రామాయంపేట, జూలై 20: ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకుండా పంట రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భానుచందర్ విమర్శించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తానన్న కాంగ్రెస్ లక్షతో సరిపెట్టిందన్నారు. అర్హులైన రైతులకు అది కూడా అందలేదన్నారు. రుణమాఫీ లిస్టులో పేరున్నా బ్యాంకులో జమ కాలేదన్నారు. సమావేశంలో అవినాష్ రెడ్డి, చింతల శేఖర్, వేముల రమేశ్, భరత్, బాసం అనిల్, సందీప్ తదితరులు ఉన్నారు.

## ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి

మనోహరాబాద్, జూలై 20: ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మహాసభ మండల అధ్యక్షుడు దాసరి నరేశ్ ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు నత్తి మల్లేశ్ ముదిరాజ్, నాగభూషణం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రైతుభరోసా డబ్బులతోనే రుణమాఫీ

చిన్నశంకరంపేట, జూలై 20: రైతుభరోసా డబ్బును కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీకి మళ్లించి రైతులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు ఆరోపించారు. నాట్లు ముగుస్తున్నా ఇప్పటివరకు రైతు భరోసా ఇవ్వకపోవడంతో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారన్నారు. కరెంటు సరఫరాలో కాంగ్రెస్ విఫలమైందన్నారు.

## లంపీస్కిన్ వ్యాధులు రాకుండా చర్యలు

రామాయంపేట, జూలై 20: పశువులకు లంపీస్కిన్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని రామాయంపేట అసిస్టెంట్ పశువైద్యాధికారి తిరుపతి తెలిపారు. శనివారం పట్టణంలోని పశువైద్యశాలలో దూడలు, మండలంలోని ఆవులకు ఈ టీకాలు వేశారు. అన్ని రకాల పశువులు, పాడి గేదెలు, దూడలు, గొర్రెలకు వైద్యం అందిస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో చర్మ వ్యాధులతో బాటు మెడ వాపు, గొర్రెలకు చిట్కు వ్యాధులు వస్తాయని, వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



దూడకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యుడు తిరుపతి